సాక్షి
విశాఖపట్నం
గురువారం । 15 । మే । 2025

విశాఖ జోన్‌పై సవతి ప్రేమ!

విశాఖ జోన్, రాయగడ డివిజన్ అంబ్రెల్లా వర్క్స్‌కి రూ.170 కోట్లు మాత్రమే..

రాయగడ డివిజన్‌కు ప్రత్యేకంగా రూ.110 కోట్లు కేటాయింపు



కన్సాలిడేటెడ్ బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు

సాక్షి, విశాఖపట్నం : కొబ్బరికాయ కొట్టేశాం.. కార్యాలయాలు కట్టేయండి అన్నట్లుగా మారింది విశాఖ రైల్వే జోన్‌పై ప్రభుత్వ వైఖరి. ప్రచార ఆర్భాటం.. ఆపై శంకుస్థాపన.. భూమి చదును.. ప్రజెంటేషన్లు.. గ్రాఫిక్స్‌లోనే హడావుడి కనిపిస్తుందే తప్ప.. క్షేత్రస్థాయిలో మాత్రం అడుగు కూడా కదలడం లేదన్న విషయం నిధుల కేటాయింపులోనే స్పష్టమవుతోంది. 2025–26 బడ్జెట్‌కు అనుబంధంగా రైల్వే కేటాయింపులకు సంబంధించిన కన్సాలిడేటెడ్ బడ్జెట్‌లో దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై సవతి ప్రేమ మాత్రమే కనిపిస్తోంది. విశాఖ రైల్వే జోన్‌తో పాటు దానికి అనుబంధంగా ఏర్పాటవుతున్న రాయగడ డివిజన్ అంబ్రెల్లా వర్క్స్‌కు కలిపి కేవలం రూ.170 కోట్లు మాత్రమే కేటాయింపులు చేయడం సర్వత్రా విస్మయానికి గురిచేస్తోంది. రాయగడ డివిజన్ పనులకు మాత్రం ప్రత్యేకంగా మరో రూ.110 కోట్లు కేటాయించడం మరింత బలాన్ని చేకూర్చుతోంది. కీలకమైన జోన్‌కు పప్పుబెల్లాలు ఇచ్చి.. రాయగడ డివిజన్‌కు మాత్రం భారీగా నిధులు అందించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డబ్లింగ్ పనులు.. కొత్త లైన్లకు నిధులు

- జోన్‌కు అన్యాయం చేస్తున్న రైల్వే మంత్రిత్వ శాఖ మిగిలిన విషయాల్లో కొంతమేర కేటాయింపులు చేయడం ఉపశమనం కలిగించే అంశం. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పనులకు ఈ బడ్జెట్‌లో కొంత మేర నిధులు కేటాయించడం శుభపరిణామం. కన్సాలిడేటెడ్ బడ్జెట్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో కేటాయింపులిలా ఉన్నాయి.
- ఓర్ ఎక్స్ఛేంజ్ కాంప్లెక్స్(ఓఈసీ) నుంచి ఉత్తర సింహాచలం వరకు 5.22 కి.మీ మేర డబ్లింగ్ పనులకు రూ.81.22 కోట్లు.
- పెందుర్తి నుంచి ఉత్తర సింహాచలం మధ్యలో సింహాచలం వద్ద సర్ఫేస్ క్రాసింగ్ లేకుండా చేసేందుకు ఫ్లైఓవర్ నిర్మాణం కోసం రూ.183.65 కోట్లు
- దువ్వాడ నుంచి ఉత్తర సింహాచలం వరకు 20.543 కిలోమీటర్ల మేర 3, 4వ లైన్ల నిర్మాణం కోసం రూ.302.25 కోట్లు.
- వడ్లపూడి జంక్షన్‌ను అనుసంధానిస్తూ గంగవరం పోర్టు నుంచి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ వరకూ టై లైన్ మాదిరిగా 12.04 కి.మీ మేర 3, 4వ లైన్ల నిర్మాణానికి రూ.154.28 కోట్లు.
- విశాఖపట్నం నుంచి గోపాలపట్నం వరకు 15.31 కి.మీ మేర థర్డ్, ఫోర్త్ లైన్ల నిర్మాణానికి రూ.159.47 కోట్లు.
- ఉత్తర సింహాచలం నుంచి గోపాలపట్నం వరకు 2.64 కి.మీ మేర థర్డ్, ఫోర్త్ లైన్ల నిర్మాణానికి రూ.129.45 కోట్లు.
- పలాస–విశాఖపట్నం–దువ్వాడ(బి రూట్)లో ట్రాక్ పునరుద్ధరణ పనుల కోసం రూ.15 కోట్లు.
- ఉత్తర సింహాచలం నుంచి గోపాలపట్నం వరకు 2.07 కి.మీ మేర బైపాస్ డబ్లింగ్ పనులకు రూ.25.93 కోట్లు.
- విశాఖపట్నం కాంప్లెక్స్ ఏరియాలో ఆటో సిగ్నలింగ్ వ్యవస్థ కోసం రూ.43.07 కోట్లు.

భూమి చదును పనులకే పరిమితం

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు శంకుస్థాపన జరిగి నాలుగు నెలలు.. టెండర్లు ఖరారు చేసి ఐదు నెలలు పూర్తయినా.. ఇంకా భూమి చదును పనులకే పరిమితమైంది. నిధుల మంజూరులో జాప్యం జరుగుతుండటం వల్లనే పనుల ప్రక్రియ అంతంతమాత్రంగానే సాగుతోంది. 2025–26 బడ్జెట్‌లో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు ఒక్క రూపాయి విదిలించని రైల్వే మంత్రిత్వ శాఖ తాజాగా రైల్వే కన్సాలిడేటెడ్ బడ్జెట్‌లోనూ మొండి చెయ్యి చూపించింది.



కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే..!

జోన్‌కు శంకుస్థాపన చేసేశామంటూ పచ్చపత్రికల్లోనూ, సోషల్ మీడియాల్లోనూ భారీగా ప్రచారం చేసుకున్న కూటమి ప్రభుత్వం.. జోన్ ప్రధాన కార్యాలయాల నిర్మాణం మాత్రం తమకు అవసరం లేదన్నట్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఫలితంగా కేంద్ర ప్రభుత్వం కూడా వైజాగ్ జోన్ కార్యకలాపాలు ఇప్పట్లో ప్రారంభించకపోయినా ఫర్వాలేదన్నట్లుగా భావిస్తోంది. అందుకే దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను పక్కనపెట్టి రాయగడ డివిజన్ నిర్మాణానికే పెద్దపీట వేస్తూ ఉత్తరాంధ్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోంది. అయినా కూటమి ఎంపీలు నోరు మెదపకపోవడం దురదృష్టకరం.

దోపిడీదారుల అడ్డా.. విశాఖ గడ్డ

కూటమి ప్రభుత్వంలో క్రైమ్ క్యాపిటల్‌గా మారిన జిల్లా

- నగరంలో వరుస దారి దోపిడీ ఘటనలు
- పట్టపగలే ప్రజలు, పర్యాటకులపై కర్రలు, కత్తులతో దాడులు
- ఐదు నెలల్లో ఆరు ఘటనలతో భయాందోళనలో ప్రజలు
- అడ్డూ అదుపు లేకుండా దొంగతనాలతో బెంబేలు



విశాఖ సిటీ:

- బీచ్ రోడ్డులో దోపిడీ దొంగలు ఇద్దరు పర్యాటకులపై బీరు సీసాలతో దాడి చేశారు. వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లు ఎత్తుకుపోయారు.
- పెందుర్తిలో జీవీఎంసీ పంప్ ఆపరేటర్‌పై కత్తులతో తెగబడ్డారు. రెండు చేతులు కోసి రూ.10 వేలు అపహరించుకుపోయారు.
- కంచరపాలెంలో ఆటోలో కూర్చున్న వ్యక్తిని బెదిరించి డబ్బు కాజేసి పరారయ్యారు.

ఇలా.. దోపిడీదారులకు విశాఖ అడ్డాగా మారిపోయింది. ప్రశాంత నగరం కాస్తా.. క్రైమ్ క్యాపిటల్‌గా తయారవుతోంది. విజిబుల్ పోలీసింగ్ అట్టర్ ఫ్లాప్ అవుతోంది. సిటీ ఆఫ్ డెస్టినీ నేరాలకు కేంద్రంగా రూపాంతరం చెందుతోంది. నగరంలో వరుస దోపిడీ ఘటనలే ఇందుకు నిదర్శనం. గత ఐదు నెలల కాలంలో ఆరు దోపిడీ ఘటనలు చోటుచేసుకున్నాయి. రాత్రి సమయాల్లోనే కాకుండా పట్టపగలు.. నగర నడిబొడ్డున కూడా దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. కత్తులు, కర్రలతో బెదిరిస్తూ ప్రజలతో పాటు పర్యాటకులను సైతం నిలువు దోపిడీ చేస్తున్నారు.

నగరంలోనూ దోపిడీలు

నగరంలో చోరీలు, రోడ్డు ప్రమాదాలు, అత్యల్పంగా హత్యా ఘటనలు సాధారణంగా జరిగేవి. కానీ దోపిడీ ఘటనలు ఏడాదికి ఒకటి, రెండు మాత్రమే చోటుచేసుకునేవి. అదీ కూడా శివారు నిర్మానుష్య ప్రాంతాల్లో మాత్రమే జరిగిన సందర్భాలు ఉన్నాయి. కానీ ఇప్పుడు దోపిడీ దొంగలు చేలరేగిపోతున్నారు. శివారు ప్రాంతాల్లోనే కాదు.. నగరంలో కూడా పెట్రేగిపోతున్నారు. పోలీసులకు సవాల్ విసురుతున్నారు. తాజాగా కంచరపాలెంలో జరిగిన ఘటన నగరంలో పరిస్థితికి అద్దం పడుతోంది. మధ్యాహ్నం 2 గంటలకు కంచరపాలెంలో పద్మశ్రీ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద వి.జీవన్‌కుమార్ ఆటోలో కూర్చొని ఉండగా.. ఇద్దరు ఆగంతకులు వచ్చి దాడికి పాల్పడ్డారు. ఒకరు సెల్‌ఫోన్ ఇవ్వమని బెదిరించగా.. మరొకరు జీవన్‌కుమార్ జేబులో ఉన్న రూ.1,700 బలవంతంగా లాక్కొని పరారయ్యారు. ఆ తర్వాత బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సాంకేతికత ఆధారంగా దోపిడీకి పాల్పడిన కంచరపాలెంకు చెందిన రౌడీషీటర్ అయిన దమరసింగ్ మోహన్ కన్నాను అరెస్టు చేశారు. మరో వ్యక్తి జాన్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. మిట్ట మధ్యాహ్నం నగరంలో జరిగిన ఈ దోపిడీ ఘటన పోలీసుల పనితీరును ప్రశ్నిస్తోంది. దొంగతనాలకు అయితే అడ్డూ అదుపు లేకుండా పోయింది.

కనిపించని విజిబుల్ పోలీసింగ్

శివారు, నిర్మానుష్య ప్రాంతాల్లో 24/7 నిఘా, విజిబుల్ పోలీసింగ్ కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైనట్లు ఈ ఘటనలు రుజువు చేస్తున్నాయి. నగరంలో నేరాలు పెరిగిపోతున్నా.. పోలీసులు మాత్రం కేవలం ట్రాఫిక్ చలానాలు వేయడంలో బిజీగా ఉంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఘటన జరిగిన తర్వాత హడావుడిగా బృందాలు వేసి దర్యాప్తు చేయడం మినహా నేరాల నియంత్రణలో విఫలమవుతున్నారన్న అపవాదును మూటగట్టుకుంటున్నారు. ప్రధానంగా కేసులను గోప్యంగా ఉంచుతుండడం అనేక అనుమానాలకు తావిస్తోంది. దర్యాప్తు పేరుతో ఘటన జరిగిన తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ కేసు వివరాలను బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆ కేసును ఛేదించిన తర్వాతే మాత్రమే మీడియా సమావేశాలు పెట్టి ఊదరగొట్టడం పరిపాటిగా మారింది. కేసు పరిష్కారం కాని పక్షంలో నేరం జరిగిందన్న విషయం కూడా తెలియకుండా చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నెలకో దోపిడీ ఘటన

- స్టీల్‌ప్లాంట్‌లో 17 ఏళ్ల బాలుడు కూడా దారి దోపిడీకి పాల్పడడం గమనార్హం. గత నెల 10న స్టీల్‌ప్లాంట్ పరిధిలో ర్యాపిడో బుక్ చేసిన బైక్ ఎక్కిన మైనర్.. మార్గంమధ్యలో రైడర్ కిషోర్‌ను కొట్టి రూ.48,100 లాక్కొని పరారయ్యాడు.
- పెందుర్తిలో ఫిబ్రవరి, మరో నెల వ్యవధిలో రెండు దారి దోపిడీలు జరిగాయి. 16వ తేదీన ఒక బాధితుడి నుంచి భారీగా నగదు, నగలు దోచుకున్నారు. అలాగే అంతకుముందు తెల్లవారుజామున 4.30 గంటలకు జీవీఎంసీ పంప్ ఆపరేటర్‌పై కత్తులతో దాడి చేసి, చేతులు కోసేసి రూ.10 వేలు కాజేశారు.
- గతేడాది చివరలో బీచ్ రోడ్డులో పర్యాటకులపై దోపిడీదారులు బీరు సీసాలతో దాడి చేసి నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు.
- అంతకుముందే పాత డైరీ ఫారంలో జాతీయ రహదారిపైన రెండు దోపిడీ ఘటనలు చోటుచేసుకున్నాయి.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.61 కోట్లు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గత 21 రోజులకు గాను 2,61,95,966 వచ్చినట్టు సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో ఎన్.సుజాత తెలిపారు. సింహగిరిపై యాత్రికసదన్‌లోని పరకామణి కేంద్రంలో బుధవారం స్వామి హుండీ ఆదాయం లెక్కించారు. నగదుతోపాటు 168.200 గ్రాముల బంగారం, 17.900 కిలోల వెండి లభించినట్టు పేర్కొన్నారు. రోజుకి సరాసరి ఆదాయం 12,47,426 వచ్చినట్టు తెలిపారు.

ఆర్టీసీకి మోదకొండమ్మ జాతర ఆదాయం రూ.6 లక్షలు

డాబాగార్డెన్స్: మోదకొండమ్మ జాతరకు ప్రత్యేక బస్సులు నడపడం ద్వారా ఏపీఎస్‌ఆర్టీసీకి రూ.6 లక్షల ఆదాయం సమకూరినట్టు జిల్లా ప్రజారవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా ద్వారకా కాంప్లెక్స్‌లో బుధవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ మోదకొండమ్మ జాతర సందర్భంగా విశాఖ నుంచి పాడేరుకు 20 బస్సులు నడిపినట్టు చెప్పారు. తద్వారా సుమారు రూ.6 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. శ్యామలాంబ జాతర పురస్కరించుకుని ఈ నెల 18 నుంచి 22 వరకు సాలూరుకు సుమారు 100 బస్సులు నడపనున్నట్టు అప్పలనాయుడు వెల్లడించారు.

అమలాపురం, కాకినాడకు అదనపు సర్వీసులు

విశాఖ నుంచి అమలాపురం, కాకినాడకు అదనపు సర్వీసులు నడుపుతున్నట్టు అప్పలనాయుడు తెలిపారు. అమలాపురానికి ఉదయం 8.45 గంటలకు, కాకినాడకు ఉదయం 5.15 గంటలకు, సాయంత్రం 4.15 గంటలకు ద్వారకా కాంప్లెక్స్ నుంచి బస్సులు బయలుదేరుతాయని వెల్లడించారు.

పాలిసెట్‌లో 2, 8 ర్యాంకుల మనవే..

ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లా విద్యార్థులు

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన పాలి సెట్‌లో విశాఖ విద్యార్థులు అదరగొట్టారు. సాంకేతిక విద్యాశాఖ బుధవారం విడుదల చేసిన పాలిసెట్ ఫలితాల్లో విశాఖ విద్యార్థులు 96.11 శాతం ఫలితాలు సాధించారు. జిల్లా నుంచి 12,365 మంది విద్యార్థులు పాలిసెట్ పరీక్ష రాయగా 11,884 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 7,421 మంది బాలురు పరీక్ష రాయగా 7,077 మంది, 4,944 మంది బాలికలు పరీక్ష రాయగా 4,807 మంది ప్రవేశాలకు అర్హత సాధించారు. రాష్ట్ర స్థాయిలో మొదటి పది స్థానాల్లో 2, 8 ర్యాంకులు విశాఖ విద్యార్థులు సాధించారు. జిల్లాకు చెందిన బాలినేని కల్యాణ్‌రామ్ 120 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు, చింతాడ చౌహాన్ 120 మార్కులతో 8వ ర్యాంకు, సబ్బవరపు హనీష్ విరాట్ 119 మార్కులతో 26వ ర్యాంకు సాధించినట్లు విశాఖ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు.

సైన్స్ రీసెర్చ్ చేస్తా..



పాలిసెట్‌లో 120 మార్కులకు గాను 120 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించాను. ఈ రోజే విడుదలైన ఏపీఆర్జేసీలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు వచ్చింది. పదో తరగతిలో 595 మార్కులు వచ్చాయి. మా స్వస్థలం గుంటూరు కాగా మా నాన్న రాజేంద్రబాబు డీవీసీలో ఉద్యోగం చేస్తున్నారు. సంగివలసలో నివాసం ఉంటున్నాం. మా అమ్మ గృహిణి. ఇంటర్మీడియట్ ఎంపీసీ చదువుతాను. ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేస్తాను. అనంతరం సైన్స్ రీసెర్చ్ చేస్తాను.

–బాలినేని కల్యాణ్‌రామ్, 2వ ర్యాంకు

ఇంజినీరింగ్ చేస్తా..



మాది శ్రీకాకుళం జిల్లా ఎల్‌ఎన్‌పేట మండలం. పాలిసెట్‌లో 120 మార్కులకు గాను 120 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు సాధించాను. పదో తరగతిలో 588 మార్కులు వచ్చాయి. ఇంటర్మీడియట్ ఎంపీసీలో చదువుతాను. ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉన్నత ఉద్యోగం సాధిస్తాను. సంఘ సేవ చేయడమే లక్ష్యం.

– చింతాడ చౌహాన్, 8వ ర్యాంకు

ఐఐటీలో చేరడమే లక్ష్యం



పాలిటెక్నిక్‌లో 26వ ర్యాంకు రావడం చాలా ఆనందంగా ఉంది. నాన్న ఎస్‌వీఆర్‌ఎస్ నాయుడు టీచర్, ఆనందపురం మండలం బాకురుపాలెంలో పనిచేస్తున్నారు. నేను బాగా చదవడానికి ఆయన సలహాలు, సూచనలు ఎంతో దోహదపడ్డాయి. మరింత బాగా చదివి ఐఐటీలో ఇంజినీరింగ్ చేయాలన్నదే లక్ష్యం.

– సబ్బవరపు హనిష్‌విరాట్, మధురవాడ

మశకం వేటకు హైటెక్ ప్లాన్

- సాంకేతిక పరిజ్ఞానంతో దోమల నియంత్రణకు చర్యలు
- సన్నద్ధమవుతున్న జీవీఎంసీ
- 'మస్కిటో' కంపెనీతో ఒప్పందానికి ఆలోచన

డాబాగార్డెన్స్: దోమ చిన్నదే.. అది కుడితే ప్రాణాలే పోతున్నాయి. దోమ కాటుతో మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటి విషజ్వరాలు ప్రబలుతున్నాయి. గతంలో వర్షాలు మొదలు కాగానే దోమలు విజృంభించేవి. కానీ ఇప్పుడు ఏడాదంతా దాడి చేస్తున్నాయి. రాత్రయితే దోమల మోత మోగుతోంది. నగరంలో దోమల బెడద తీవ్రం కావడంతో పౌరులు సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో దోమల నియంత్రణకు సంప్రదాయ పద్ధతులతో పాటు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని జీవీఎంసీ భావిస్తోంది. ఇందులో భాగంగా అమెరికా ఆధారిత 'మస్కిటో' అనే సంస్థ అభివృద్ధి చేసిన మస్కిటో ట్రాప్ మెషీన్లను నగరంలో ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ యంత్రాల పనితీరును అధ్యయనం చేసేందుకు జీవీఎంసీ అధికారుల బృందం తిరువనంతపురం, హైదరాబాద్‌లలో పర్యటించనుంది. అక్కడి అనుభవాలను, యంత్రాల పనితీరును విశ్లేషించి సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనుంది.

జోన్–4, జోన్–5లో పైలట్ ప్రాజెక్టు?

తిరువనంతపురం, హైదరాబాద్‌లలో ఈ యంత్రాల పనితీరు సంతృప్తికరంగా ఉన్నట్లయితే విశాఖలోనూ ఏర్పాటు చేయనున్నారు. తొలి దశలో పైలట్ ప్రాజెక్టుగా జోన్–4, జోన్–5లలో సుమారు 120 మస్కిటో ట్రాప్ మెషీన్లను ఏర్పాటు చేయాలని అధికారులు ఆలోచిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు మొత్తంగా కోటిన్నర రూపాయలు ఖర్చు అవుతుందని సంబంధిత సంస్థ నివేదికలో పేర్కొంది. మరోవైపు దోమల నియంత్రణలో భాగంగా జీవీఎంసీ, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా జూన్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నాయి. ఈ డ్రైవ్ కోసం కాంట్రాక్టు పద్ధతిలో 400 మంది సిబ్బందిని నియమించి.. వారికి రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. దోమల వ్యాప్తి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై వీరు ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.



ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది(ఫైల్)

ఎలా పనిచేస్తుందంటే.?

దోమలు మనుషుల శ్వాస, వాసనలు పసిగట్టి కుడతాయి. ఇదే సిద్ధాంతంతో ఈ ట్రాపర్ మిషన్ పనిచేస్తుంది. ఈ అత్యాధునిక యంత్రాలు మనుషుల శ్వాస, శరీర ఉష్ణోగ్రత, వాసనలను అనుకరించడం ద్వారా దోమలను ఆకర్షిస్తాయి. యూవీ కిరణాలు, కార్బన్ డయాక్సైడ్ విడుదల, 39–40 డిగ్రీల ఉష్ణోగ్రతతో సుమారు 500 మీటర్ల దూరం వరకు దోమలను వలలోకి రప్పిస్తాయి. అలా యంత్రంలో చిక్కిన దోమలు లోపల ఉన్న ఫ్యాన్ గాలికి ఎయిర్ బ్యాగ్‌లోకి వెళ్లి చనిపోతాయి. ఫలితంగా నగరంలో ఏయే ప్రాంతాల్లో దోమలు అధికంగా ఉన్నాయి? ఏ రకం దోమల వల్ల ఎలాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది? అనే వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది. ఇవి 'క్యాచ్(పట్టుకోవడం), కౌంట్(లెక్కించడం), క్లాసిఫై(వర్గీకరించడం)'అనే మూడు ప్రధాన పనులు చేస్తాయి. యంత్రాల్లో ఉపయోగించే సువాసనతో కూడిన ద్రవాలు, సెన్సర్ల సాయంతో దోమలను ఆకర్షించి, వాటిని వర్గీకరించి వ్యాధి కారక దోమల వ్యాప్తి ఉన్న ప్రాంతాలను గుర్తించడానికి సహాయపడతాయి.

సాంకేతికతతో నియంత్రణ

సాంకేతికత సాయంతో దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. మస్కిటో ట్రాప్ మెషీన్ల ద్వారా దోమల నివారణతో పాటు ఏ ప్రాంతాల్లో ఎటువంటి వ్యాధికారక దోమలు ఉన్నాయో గుర్తించడం సులభతరం అవుతుంది. దీని వల్ల ఆయా ప్రాంతాల్లో దోమల నివారణకు మరింత సమర్థవంతంగా చర్యలు చేపట్టవచ్చు. అధికారుల అధ్యయనం అనంతరం ఈ ప్రాజెక్టుపై కమిషనర్ తుది నిర్ణయం తీసుకుంటారు.

–డాక్టర్ నరేష్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి, జీవీఎంసీ

అంకితభావంతో 'స్వచ్ఛాంధ్ర' నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను అంకితభావంతో నిర్వహించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల నిర్వహణపై బుధవారం తన చాంబర్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, పార్కులు, బస్, రైల్వే స్టేషన్లు, వసతి గృహాలు, ఆసుపత్రులు తదితర ప్రాంతాల్లో ఈ నెల మూడో శనివారం స్వచ్ఛందంగా పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. వేసవిలో వడగాలుల నుంచి ప్రజలు ఉపశమనం పొందేలా, పచ్చదనం పెంపొందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్మికులు, వీధి వ్యాపారులు, చిన్న పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో అత్యంత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. టెర్రస్ గార్డెనింగ్, తడిపొడి చెత్త నిర్వహణ, పబ్లిక్ టాయిలెట్ల వినియోగం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో సీఎంవో నరేష్ కుమార్, డిపివో శ్రీనివాసరావు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులకు పీపీవోల జారీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్ల(పీపీవోలు) జారీ ప్రారంభమైంది. ఇప్పటి వరకు అడపాదడపా పీపీవోలు జారీ కాగా, ఇటీవల వాటిని వేగవంతం చేశారు. ఈ నెల 14 నాటికి 45 మంది రిటైర్డ్ ఉద్యోగులకు పీపీవోలు జారీ అయ్యాయి. ఈ అంశంపై పెన్షన్ వారియర్స్.. రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అవినాష్ కుమార్‌ను కలిసి పీపీవోల జారీని వేగవంతం చేయడం, ఇతర సమస్యలపై చర్చించారు. దీనిపై అవినాష్ మాట్లాడుతూ రోజుకు 50 చొప్పున స్టీల్‌ప్లాంట్‌తో పాటు ఇతర సంస్థలకు చెందిన పీపీవోలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి హయ్యర్ పెన్షన్ పేమెంట్లకు అర్హులైన అందరికీ పీపీవోలు జారీ చేసేలా ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. తమకు అందే ఉత్తర ప్రత్యుత్తరాలు, ఆర్‌టీఐ వినతులకు సమాధానం ఇవ్వడానికే ఎక్కువ సమయం పడుతోందని, తద్వారా పీపీవోల జారీలో జాప్యం జరుగుతోందన్నారు. పీపీవోల జారీలో పీఎఫ్ కార్యాలయంతో సహకరించాలని ఆయన కోరారు.

అరకు రైలుకు అదనపు కోచ్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అరకు రైలుకు తాత్కాలికంగా అదనపు కోచ్‌ను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్(58501) పాసింజర్‌కు ఈ నెల 17, 24, 31వ తేదీల్లోను, తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం(58502) పాసింజర్‌కు ఈ నెల 18, 25, జూన్ 1వ తేదీల్లో ఒక ఏసీ చెయిర్ కార్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నట్లు పేర్కొన్నారు.

మూడేళ్ల బాలికకు తిరగబడ్డ మూత్రపిండం

అరుదైన శస్త్ర చికిత్సతో పాపను కాపాడిన కిమ్స్ ఐకాన్ వైద్యులు

అక్కిరెడ్డిపాలెం: పుట్టుకతోనే మూత్రపిండం సమస్య ఉన్న మూడేళ్ల పాపకు అరుదైన శస్త్రచికిత్సను శీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఆస్పత్రి యూరాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ అభిరామ్ కుచ్చర్లపాటి సూక్ష్మ పద్ధతిలో చికిత్స నిర్వహించి, పాప ప్రాణాలు కాపాడారు. వివరాలు.. తీవ్రమైన కడుపునొప్పి, బరువు తగ్గడం తదితర సమస్యలతో ఏప్రిల్ 28న పాపను ఆస్పత్రిలో చేర్చారు. వైద్యులు పలు రకాల పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో పాపకు పెల్వి యూరేటరిక్ జంక్షన్(పీయూజే) అబ్‌స్ట్రక్షన్ సమస్య ఉందని తేలింది. ఇది కిడ్నీ నుంచి మూత్ర కోశానికి వెళ్లే దారిలో ఉండే అడ్డంకి. దీనికి తోడు పాప కిడ్నీ సాధారణ స్థితిలో కాకుండా తిరగబడి ఉంది. ఇలాంటి సమస్యకు సాధారణంగా ఓపెన్ శస్త్ర చికిత్స చేస్తారు. కానీ పాప వయసు దృష్ట్యా మినిమల్లీ ఇన్వేజన్ శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. ఇందుకు లాప్రోస్కోపిక్ పైలోప్లాస్టీ అనే సూక్ష్మ శస్త్ర చికిత్సను ఎంచుకున్నారు. కేవలం చిన్నచిన్న రంధ్రాల ద్వారా చేసిన ఈ శస్త్రచికిత్స వల్ల మచ్చలు పడకపోవడం, తక్కువ నొప్పి, త్వరగా కోలుకునే అవకాశం ఉంది. తిరగబడిన కిడ్నీ చుట్టూ సున్నితమైన అవయవాలకు ఏమాత్రం దెబ్బ తగలకుండా ఈ నెల 3న పాపకు సర్జరీ నిర్వహించారు. 5న డిశ్చార్జ్ చేశారు. పాపకు అన్ని సక్రమంగా ఉండటంతో పాటు మూత్ర విసర్జన కూడా సాధారణంగా ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. తమ పాప ప్రాణాలు కాపాడిన డాక్టర్ అభిరామ్ వైద్య బృందానికి, ఆస్పత్రి సిబ్బందికి పాప తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఒకే రోజు.. ఒకే ప్రశ్నాపత్రం


ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు

- రాష్ట్రమంతా ఒకే రోజు డీఎస్సీ నిర్వహించాలని అభ్యర్థుల డిమాండ్
- నెల రోజులు నిర్వహిస్తే ప్రిపరేషన్ సమయాన్ని కోల్పోతామని ఆవేదన
- స్పెషల్ డీఎస్సీ పోస్టులు కూడా భర్తీ చేయాలని డిమాండ్

సీతంపేట: రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ(ఉపాధ్యాయ నియామక పరీక్ష)ను ఒకే రోజు ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని ఉపాధ్యాయ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. నెల రోజుల పాటు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయం తమను తీవ్రంగా నష్టపరుస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మునుపెన్నడూ లేని విధంగా డీఎస్సీలో ప్రవేశపెట్టిన కొత్త నిబంధనలు, విధానాలు తమ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయని వాపోతున్నారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీతో లక్షలాది మంది నిరుద్యోగ యువత ఆశలు పెట్టుకున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది జూన్‌లో సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసినప్పటికీ.. 10 నెలల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం కేవలం 16,347 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయడం అభ్యర్థులను తీవ్ర నిరాశకు గురిచేసింది. 50 వేలకు పైగా పోస్టులతో మెగా డీఎస్సీ వస్తుందని ఆశించిన వారికి ఇది శరాఘాతంగా మారింది.

సమాన అవకాశాలకు విఘాతం

ప్రభుత్వం తాజాగా డీఎస్సీ పరీక్షలను జూన్ 6 నుంచి జూలై 6 వరకు నెల రోజుల పాటు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని ప్రకటించడం అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ విధానం వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయని వారు పేర్కొంటున్నారు. నెల రోజుల పాటు జరిగే పరీక్షల్లో ప్రతి రోజూ వేర్వేరు ప్రశ్నాపత్రాలు ఉంటాయని.. దీని వల్ల ఏ రోజు పేపర్ కష్టంగా వస్తుందో.. ఏ రోజు సులువుగా వస్తుందో తెలియని అనిశ్చితి నెలకొంటుందని ఆవేదన చెందుతున్నారు. కష్టమైన ప్రశ్నాపత్రం వచ్చిన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా మొదటి రోజుల్లో పరీక్ష రాసే అభ్యర్థులు తదుపరి రోజుల్లో ప్రిపరేషన్‌కు సమయం కోల్పోతారని, ఇది సమాన అవకాశాలకు విఘాతమని వాపోతున్నారు. గతంలో మాదిరిగా రాష్ట్రమంతటా ఒకే రోజు.. ఒకే ప్రశ్నాపత్రంతో ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

వయో పరిమితి పెంచాలి

గత ఏడేళ్లుగా డీఎస్సీ నియామకాలు లేకపోవడంతో వయోపరిమితి దాటిపోయిన అభ్యర్థులు చాలా మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో డీఎస్సీ అభ్యర్థుల వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని కోరుతున్నారు. అలాగే ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా చెవిటి, మూగ, అంధ విద్యార్థులకు బోధించే 2,600 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను ఈ డీఎస్సీ నోటిఫికేషన్‌లో చేర్చకపోవడంపై స్పెషల్ బీఈడీ, డైట్ చదివిన లక్షలాది మంది నిరుద్యోగులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా ప్రభుత్వ నూతన డీఎస్సీ విధానాలు, నిబంధనలు తమ ఆశలపై నీళ్లు చల్లడమే కాకుండా, తమ భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నాయని నిరుద్యోగ యువత మండిపడుతున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిగణలోకి తీసుకుని.. ఒకే రోజు పరీక్ష నిర్వహించాలని, వయోపరిమితిని పెంచాలని, ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఒకే రోజు పరీక్ష నిర్వహించాలి



డీఎస్సీ నెల రోజుల పాటు కాకుండా రాష్ట్రమంతా ఒకే రోజు ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలి. నెలరోజుల పాటు నిర్వహించడం వల్ల ప్రిపరేషన్ సమయాన్ని కోల్పోతాం. అలాగే ఒక రోజు కష్టంగా, ఒక రోజు సులువుగా పరీక్ష పేపర్ రావచ్చు. దీని వల్ల అభ్యర్థులు నష్టపోయే అవకాశం ఉంది. నెల రోజుల పరీక్ష కాలాన్ని అభ్యర్థుల ప్రిపరేషన్‌కు కేటాయించి.. ఒకే రోజు రాష్ట్రమంతా పరీక్ష నిర్వహిస్తే బాగుంటుంది.

– జి.గణేష్, ఎస్జీటీ అభ్యర్థి

స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలి



మూగ, చెవిటి, అంధ విద్యార్థులకు బోధించేందుకు 2,600 పోస్టులతో స్పెషల్ డీఎస్సీ తీస్తామని ఎన్నికల ముందు ప్రకటించారు. ఇప్పుడు డీఎస్సీ మాత్రమే ప్రకటించి.. స్పెషల్ డీఎస్సీని పక్కన పెట్టారు. ప్రభుత్వం తీరు స్పెషల్ బీఈడీ, డైట్ చదివిన లక్ష మంది అభ్యర్థులను నిరాశకు గురిచేసింది. వెంటనే స్పెషల్ డీఎస్సీ కూడా ప్రకటించాలి.

–ఎస్.వెంకటేశ్వరరావు, స్పెషల్ బీఈడీ అభ్యర్థి, హెచ్‌బీ కాలనీ

వన్ డిస్ట్రిక్ట్.. వన్ పేపర్



ఆఫ్‌లైన్‌లో ఐదారు రోజుల్లో డీఎస్సీ పూర్తి చేయవచ్చు. దీని వల్ల అభ్యర్థులకు 25 నుంచి 30 రోజుల వరకు ప్రిపరేషన్ సమయం దొరుకుతుంది. ఆఫ్‌లైన్‌లో లేదా వన్ డిస్ట్రిక్ట్ వన్ పేపర్‌గా పరీక్ష నిర్వహిస్తే అభ్యర్థులకు ప్రయోజకరంగా ఉంటుంది.

– ఎ.సుధీర్, డీఎస్సీ అభ్యర్థి

కూటమి నేతల అండతో యథేచ్ఛగా ఇసుక దందా!

- అధిక లోడుతో లారీల్లో దర్జాగా ఇసుక రవాణా
- మంత్రులు లోకేష్, రవీంద్ర పేర్లు చెప్పి వెళ్లేందుకు ప్రయత్నం
- రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యం, మామూళ్ల వసూళ్లపై ఆరోపణలు


అధికలోడుతో ఇసుకను తీసుకువెళ్తున్న లారీలను అడ్డుకున్న స్థానిక లారీ యజమానులు

తగరపువలస: అధిక లోడుతో ఇసుక రవాణా చేస్తున్న నాలుగు లారీలను బుధవారం జిల్లా క్వారీ, లారీ యజమానుల సంఘంతో పాటు స్థానిక లారీ సంఘాల యజమానులు చెరకుపల్లి వద్ద జాతీయ రహదారిపై అడ్డుకున్నారు. శ్రీకాకుళం జిల్లా నారాయణపురం ఇసుక రీచ్ నుంచి 35 టన్నుల సామర్థ్యం కలిగిన లారీలపై 70 నుంచి 80 టన్నుల ఇసుకను రవాణా చేస్తున్నట్టు గుర్తించిన జిల్లా క్వారీ లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు మద్దిల వెంకటరమణ, మిగిలిన యజమానులతో కలిసి ఉదయం 4 గంటల నుంచి కాపు కాశారు. ఉదయం 6 గంటల సమయంలో విశాఖ వైపు వెళ్తున్న మూడు లారీలను అడ్డుకున్నారు. వాటి సిబ్బంది మంత్రులు నారా లోకేష్, కొల్లు రవీంద్ర పేర్లు చెప్పి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా కదలనీయలేదు. తగరపువలస ఫ్లై ఓవర్ వద్ద మరొక లారీని కూడా నిలిపివేశారు. సుమారు 10 గంటల సమయంలో భీమిలి పోలీసులు వచ్చి బేషరతుగా లారీలను అక్కడి నుంచి పంపించేశారు. ఈ సందర్భంగా విజయవాడకు చెందిన వెంకటేశ్వరరావు అనే వ్యక్తి మద్దిల వెంకటరమణను బెదిరించినట్టు తెలిసింది. తన ఇసుక లారీలను అడ్డుకుంటే ఎఫ్ఐఆర్ వేయిస్తామని హెచ్చరించినట్టు సమాచారం. అనంతరం స్థానిక లారీ యజమానులు మాట్లాడుతూ రెట్టింపు లోడుతో ఇసుకను రవాణా చేస్తున్నా.. రవాణా శాఖ చూసీ చూడనట్టు వ్యవహరిస్తోందని ఆరోపించారు. రెట్టింపు లోడుతో వాహనాలకు ప్రమాదాలు జరిగితే ఇరు పార్టీలకు బీమా పరిహారం ఇవ్వడానికి ఇన్సూరెన్స్ సంస్థలు అంగీకరించవని చెప్పారు. లారీపై ఇసుకను పూర్తిగా కప్పివేయకుండా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారని పేర్కొన్నారు. అదనపు లోడు కారణంగా తరచూ టైర్లు ఒత్తిడికి గురై రన్నింగ్‌లో పేలిపోతుండటంతో వెనుక వచ్చే వాహనాలు కూడా ప్రమాదాల బారిన పడుతున్నాయన్నారు. అధిక లోడును పట్టించుకోకుండా ఉండేందుకు మూడు జిల్లాల్లో రవాణాశాఖ అధికారులు నెలకు రూ.22 వేలు వంతున ఒక్కో లారీ యజమాని నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నట్టు ఆరోపించారు. ఇప్పుడు దౌర్జన్యంగా కూటమి నాయకుల అండతో ఇసుకను అధిక లోడుతో రవాణా చేస్తూ.. తమను నిలువునా ముంచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో మిగిలిన లారీ యజమానులతో సమావేశమై అధిక లోడుతో వచ్చే వాహనాలను ఇకపై కూడా అడ్డుకుంటామని లారీ యజమానులు బొట్ట సురేష్, కొయ్య శ్రీనివాసరెడ్డి, కర్రి రమణ, తుపాకుల సురేష్, వీడీఎం గిరి, మద్దిల శ్రీను హెచ్చరించారు.

నగ్నంగా దొంగతనానికి యత్నం

ఎంవీపీకాలనీ: స్థానిక సెక్టార్–6లో మంగళవారం అర్ధరాత్రి ఓ వ్యక్తి నగ్నంగా ఇంట్లోకి చొరబడి దొంగతనానికి ప్రయత్నించాడు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. బి.విశ్వసాయి ఎంవీపీ సెక్టార్–11లోని శ్రీమారుతి నిలయంలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి నగ్నంగా ఇంటి ముందు తిరగడంతో పాటు ఇంట్లోకి చొరబడి దొంగతనం చేసేందుకు ప్రయత్నించాడు. ఇంటి ముందున్న సీసీ టీవీని ధ్వంసం చేశాడు. ఈ ఘటనపై విశ్వసాయి ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రంపై దాడి

ఎంవీపీకాలనీ: లాసన్స్ బే కాలనీలోని శాంతి ఆశ్రమం భూముల్లో నిర్వహిస్తున్న గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రంపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. శాంతి ఆశ్రమం డైరెక్టర్ రవిప్రసాద్ అనుమతితో షేక్ అహ్మద్ షరీఫ్‌తో కలిసి జి.హిమబిందు గుర్రపు స్వారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అక్కడ సెక్యూరిటీ గార్డ్‌గా డోలా రామకృష్ణను నియమించారు. ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆశ్రమం నిర్వాహకులు ఈ భూమి స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. కాగా.. గత నెల 23న ఒక ఎద్దును శిక్షణ కేంద్రం స్థలంలోకి పంపించడంతో పాటు 24వ తేదీన 15 మంది అక్కడికి వచ్చి కేంద్రంపై దాడి చేశారు. గుర్రాలను తరిమికొట్టారు. ఈ క్రమంలో సెక్యూరిటీ గార్డ్ రామకృష్ణ వీడియో తీయగా అతని మొబైల్ లాక్కుని డేటాను తొలగించారు. గతంలో ఆ భూమిని అక్రమంగా వినియోగించుకున్న సిద్ధార్థ్ అలియాస్ సిద్ధు తమను పంపించినట్లు దాడి చేయడానికి వచ్చిన వారు తెలిపినట్లు సమాచారం. ఆ భూమిని ఖాళీ చేసి వెళ్లిపోవాలని బెదిరించడంతో పాటు రాత్రికి రాత్రి ఆ స్థలంలోకి ఎవరూ రాకుండా గేట్లకు వెల్డింగ్ చేశారు. అప్పటి నుంచి గొడవలు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం హిమ బిందు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

డాబాగార్డెన్స్: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (నర్సింగ్), ప్రొడక్షన్ మెషీన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ రెండవ అంతస్తులో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించే ఈ కోర్సుల్లో చేరేందుకు డిగ్రీ, ఇంటర్, డిప్లమో, ఐటీఐ, పదో తరగతి పూర్తి చేసి 18 నుంచి 28 ఏళ్లలోపు నిరుద్యోగులు అర్హులు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో 3 నెలల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు యూనిఫాం, పుస్తకాలు, ఏసీ క్యాంపస్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి బీఎస్సీ/డిప్లమో పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. శిక్షణ పూర్తయిన వెంటనే ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, మరిన్ని వివరాలకు 73370 76665, 72079 53920 నంబర్లలో సంప్రదించాలని నాగేశ్వరరావు సూచించారు.

గోదావరి సహా పలు రైళ్లకు 'కేసముద్రం'లో తాత్కాలిక హాల్ట్

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్ పరిధి మహబూబాబాద్‌లో ఆయా తేదీల్లో పలు రైళ్లకు తాత్కాలికంగా హాల్ట్‌ను తొలగించినట్లు వాల్తేరు డివిజన్ అధికారులు తెలిపారు. మహబూబాబాద్‌లో ప్రీ నాన్ ఇంటర్‌లాకింగ్, నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు జరుగుతున్నాయి. అలాగే కాజీపేట–కొండపల్లి మధ్య మిగిలిన మూడవ లైన్ ప్యాచ్ వర్క్ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు విశాఖపట్నం–హైదరాబాద్(12727) గోదావరి ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–మహబూబ్‌నగర్(12861) ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి(11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, షాలిమర్–హైదరాబాద్(18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ మహబూబాబాద్‌లో ఆగవు. దీనికి బదులుగా సమీప స్టేషన్ కేసముద్రంలో ఈ రైళ్లకు తాత్కాలిక హాల్ట్‌ను కల్పించారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని అధికారులు కోరారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'ఓక్రిడ్జ్' సత్తా


అనుష్క వెంకట


ఆరవ్ పాండే


అశుతోష్


సిరిపురపు శ్రీకర్

తగరపువలస: సీబీఎస్ఈ 10, +2 బోర్డు పరీక్ష ఫలితాల్లో భీమిలి మండలం శింగనబంద ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. 10వ తరగతిలో 500 మార్కులకు గానూ కందుల అనుష్క వెంకట 484, ఆరవ్ పాండే 478 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. +2లో 500 మార్కులకు గానూ అశుతోష్ సమంత్‌రాయ్ 442, సిరిపురపు శ్రీకర్ 439 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. స్కూల్‌కు చెందిన ముగ్గురు న్యూరో డైవర్స్ విద్యార్థులు 71, 76, 61 శాతాలతో విజయవంతంగా +2 పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల మాట్లాడుతూ తమ విద్యార్థులు ఇప్పటి వరకు ఎన్నో మైలురాళ్లు సాధించారన్నారు. ఈ ఫలితాల వెనుక ఉపాధ్యాయుల నిబద్ధత, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉందన్నారు. విద్యార్థులను అభినందించారు.

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.105
బ్రాయిలర్ (లైవ్)	: రూ.125
స్కిన్	: రూ.220
స్కిన్‌లెస్	: రూ.230

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	510.00
విజయనగరం	514.00
శ్రీకాకుళం	514.00

'ఘ'న' విశాఖ



విశాల విశాఖపట్నం.. పేరుకు తగినట్లుగానే సుందర దృశ్యాల సమాహారం. ఒకవైపు అనంతమైన సాగరతీరం.. మరో వైపు గంభీరమైన పర్వత శ్రేణులు. వీటి నడుమ సువిశాలంగా విస్తరించిన మహా నగరం విశాఖ. ప్రపంచంలోనే ఇలాంటి అపురూప భౌగోళిక స్వరూపం కలిగిన నగరాలు చాలా తక్కువ. అందుకే ఇక్కడ జీవించడానికి ఎంతో మంది మక్కువ చూపుతారు. ఒకప్పుడు చిన్న మత్స్యకార గ్రామంగా ఉన్న విశాఖ.. నేడు బహుముఖాభివృద్ధి సాధించి మహా నగరంగా రూపాంతరం చెందింది.



వివిధ రంగాల్లో దూసుకుపోతూ నగరం తన పరిధిని విస్తరించుకుంటూ పోతోంది. పర్యాటకులకు ఇది స్వర్గధామం అనడంలో అతిశయోక్తి లేదు. అటువంటి విశాఖ నగరాన్ని ఆకాశం నుంచి వీక్షిస్తే ఆ అనుభూతే వేరు. మబ్బుల పొరల మాటు నుంచి నగరాన్ని చూస్తే దాని సౌందర్యాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. యారాడ కొండలు, పోర్టు ప్రాంతం, పాత నగరాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

వేలి ముద్రలే పట్టించాయి..

ఘరానా దొంగ అరెస్ట్

- నిందితుడు తెలంగాణకు చెందిన పాత నేరస్తుడు
- 90 వరకు కేసుల నమోదు అందులో 77 దొంగతనం కేసులే..
- ద్వారకానగర్ రాధామాధవ్ టవర్స్ కేసును ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న ఏడీసీపీ మోహనరావు

ఎంవీపీకాలనీ: ద్వారకానగర్ రాధామాధవ్ టవర్స్‌లో ఈ ఏడాది మార్చి ఒకటో తేదీన దొంగతనానికి పాల్పడిన పాత నేరస్తుడు తిప్పరాజు రామకృష్ణ (26)ను ఎంవీపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎంవీపీకాలనీ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం క్రైం ఏడీసీపీ మోహనరావు ఈ కేసు వివరాలు వెల్లడించారు. మార్చి ఒకటో తేదీ ఉదయం రాధా మాధవ్ టవర్స్ ఫ్లాట్ నంబర్ 2లో నివాసం ఉంటున్న మరకాని రామకృష్ణ తన అమ్మమ్మ వర్ధంతి కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో కలిసి కాకినాడ వెళ్లారు. ఆ మరుసటి రోజు ఉదయం అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న శ్రావణి అతనికి ఫోన్ చేసి.. మీ ఇంటి తాళం పగలగొట్టి ఉంది అని సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన ఆయన విశాఖ వచ్చి ఇంటిని పరిశీలించగా.. 23 తులాల బంగారం, రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఇంట్లోని బీరువాను దొంగ బెడ్‌పై పడుకోబెట్టి తాళాలు పగలగొట్టి నగదు, బంగారం చోరీ చేశాడు. వెంటనే రామకృష్ణ ద్వారకా క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ద్వారకా క్రైం సీఐ చక్రధర్‌రావు బృందం ఘటన ప్రాంతాన్ని పరిశీలించింది. ఫింగర్ ప్రింట్స్ విభాగం ద్వారా వేలిముద్రలను సేకరించి పరిశీలనకు పంపించగా.. తెలంగాణకు చెందిన పాత నేరస్తుడు తిప్పరాజు రామకృష్ణ వేలిముద్రలతో సరిపోయినట్లు ఫింగర్ ప్రింట్స్ బ్యూరో సమాచారం అందించింది. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ద్వారకా క్రైం ఎస్ఐ రాజు, ఏఎస్ఐ కిశోర్ బాబు ఇతర సిబ్బంది బృందాలుగా విడిపోయి హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని అతని నివాస ప్రాంతాల్లో దర్యాప్తు చేసి రామకృష్ణ ప్రస్తుతం వాడుతున్న ఫోన్ నంబర్లు, వివరాలు సేకరించారు. దీంతో నిందితుడు విశాఖలోనే ఉన్నట్లు గుర్తించారు. ద్వారకా క్రైం పోలీసులు, ఆరిలోవ క్రైం ఎస్ఐ రామకృష్ణ బృందం నిందితుడు రామకృష్ణను మద్దిలపాలెం వద్ద మంగళవారం అరెస్ట్ చేసింది.

విశాఖలో తొలిసారి దొంగతనం

కాగా.. రామకృష్ణ మేనల్లుడు అశోక్, అక్క భాగ్యమ్మలను హైదరాబాద్ ఎస్ఆర్ నగర్ పోలీసులు ఈ నెల 6న వేరే కేసులో అరెస్ట్ చేసి వారి ఇంట్లో తనిఖీలు చేయగా రూ.3,40,000, 77 గ్రాముల బంగారు వస్తువులు లభించాయి. అశోక్‌ను విచారించగా.. తన మేనమామ రామకృష్ణ విశాఖలో చేసిన దొంగతనానికి సంబంధించినవిగా వెల్లడించాడు. ఇదిలా ఉండగా మరి కొన్ని బంగారు నగలను పలు బ్యాంకుల్లో తాకట్టు పెట్టినట్లు ద్వారకా క్రైం పోలీసుల విచారణలో రామకృష్ణ తెలిపాడు. రామకృష్ణను పట్టుకున్న సమయంలో అతని వద్ద నుంచి రూ.10 వేలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఆర్ నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ.3.40 లక్షలు, 77 గ్రాముల బంగారంతో పాటు రామకృష్ణ వద్ద దొరికిన రూ.10 వేలను కలిపి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగతా నగదు, బంగారాన్ని రికవరీ చేయాల్సి ఉందని ఏడీసీపీ తెలిపారు. రామకృష్ణపై 90 వరకు పాత కేసులు ఉన్నాయి. అందులో 77 దొంగతనం కేసులున్నట్లు ఏడీసీపీ వివరించారు. విశాఖలో తొలిసారి దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ద్వారకా క్రైం ఎస్ఐ రాజు, ఏఎస్ఐ డి.కిశోర్‌బాబు, కానిస్టేబుల్ అప్పలనాయుడు, రాజు, అప్పలరాజు, అగస్టీన్, జగత్ కిరణ్‌లను ఏడీసీపీ మోహనరావు, ఏసీపీ లక్ష్మణరావు, సీఐ చక్రధర్‌రావు అభినందించారు.

సాహితీ కృషీవలుడు 'కొమర్రాజు'


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు

విశాఖ విద్య : తెలుగు జాతి గర్వించదగ్గ నవయుగ వైతాళికుడు కొమర్రాజు లక్ష్మణరావు అని కేంద్ర ప్రభుత్వ హిందీ సలహా మండలి సభ్యుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. సాహితీ కృషీవలుడని కొనియాడారు. కొమర్రాజు జీవిత సాహిత్య కృషిపై ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఆచార్య వెలమల సిమ్మన్న, విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాల విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు డా.గుమ్మా సాంబశివరావు రచించిన 'విజ్ఞాన సర్వస్వ రూపశిల్పి కొమర్రాజు లక్ష్మణరావు' గ్రంథాన్ని యార్లగడ్డ ఆవిష్కరించారు. ఏయూలోని హిందీ భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగు వారికి అపూర్వమైన కానుకలను అందించిన ఆ మహనీయుడి ఘనత ఈ తరానికి తెలియజేసేందుకు సిమ్మన్న, సాంబశివరావు అమూల్యమైన గ్రంథం రచించారని కొనియాడారు.

చేయి విరిగిందని వెళితే.. ప్రాణం పోయింది

- వైద్యం వికటించి మహిళ మృతి
- అనిల్ నీరుకొండ(ఎన్ఆర్ఐ) ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన


సంగివలస ఎన్ఆర్ఐ ఆసుపత్రి ముందు ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

తగరపువలస: వాష్‌రూమ్‌లో జారిపడి చేయి విరిగిన ఓ మహిళ తొలుత సంగివలసలోని అనిల్ నీరుకొండ(ఎన్ఆర్ఐ) ఆసుపత్రిలో చికిత్స పొంది. అక్కడ పరిస్థితి విషమించడంతో నగరంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. తన భార్య మృతికి అనిల్ నీరుకొండ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆమె భర్త జనార్దన్ ఆరోపించారు. కుటుంబసభ్యులతో ఆసుపత్రి ముందు బైఠాయించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వివరాలివి. భీమిలి మండలం చిప్పాడలో నివాసముంటున్న డీవీస్ ఉద్యోగి జనార్దన్ భార్య యర్రంశెట్టి రేవతి ఈ నెల 10న ప్రమాదానికి గురైంది. వెంటనే ఆమెను ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చేర్పించగా.. అక్కడ వైద్యం వికటించి అపస్మారక స్థితికి చేరుకుంది. మెరుగైన వైద్యం కోసం జనార్దన్ ఆమెను నగరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి అత్యవసరంగా తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె బుధవారం మృతి చెందింది. దీంతో పలు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. రేవతి మృతదేహంతో ఎన్ఆర్ఐ ఆసుపత్రి ఎదుట ఆందోళన జరిగే అవకాశం ఉందని ముందే ఊహించిన సిబ్బంది.. మృతదేహాన్ని హుటాహుటిన కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ పోస్టుమార్టం ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం ఆమె స్వగ్రామమైన అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కొవ్వూరుకు మృతదేహాన్ని పంపే ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో కేజీహెచ్ వద్ద ఆమె భర్త ఆందోళనకు సన్నద్ధమయ్యారు. తన భార్య అపస్మారక స్థితికి చేరుకోవడానికి కారణమైన వైద్యురాలిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిని తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. జనార్దన్‌కు సంఘీభావంగా ఆయన స్వగ్రామానికి చెందిన బంధువులు, డీవీస్ ఉద్యోగులు, పలు ప్రజా సంఘాల నాయకులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సాయంత్రం 8 గంటల తర్వాత వారంతా కలిసి సంగివలసలోని ఆసుపత్రి ఎదుట పెద్ద ఎత్తున బైఠాయించి ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఆసుపత్రి యాజమాన్యం ఆందోళనకారులు, బాధితుల తరపున వచ్చిన ప్రజా సంఘాల ప్రతినిధులతో చర్చలు ప్రారంభించింది. భీమిలి పోలీసులు ఆసుపత్రి వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.